
సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 3 । జూన్ । 2025



మోడల్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

విజయవాడ ఎస్ఎన్ పురం పోలీస్‌స్టేషన్ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. -IIలో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,292 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నెమలి హుండీ ఆదాయం లెక్కింపు

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. రూ.15.93 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ జయప్రకాష్‌బాబు తెలిపారు.

న్యూస్‌రీల్

ట్రాఫిక్ మహిళా కానిస్టేబుళ్లకు షూలు, గ్లౌజులు పంపిణీ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లకు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ సోమవారం స్పోర్ట్స్ షూ, మాస్కులు, హ్యాండ్ గ్లౌజులను అందజేశారు. స్త్రీ శక్తిని ప్రోత్సహించే సదుద్దేశంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఏడీసీపీ తెలిపారు. 33 మంది మహిళా కానిస్టేబుళ్లకు ఈ వస్తువులను అందజేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి నలుగురి ప్రాణాలు కాపాడిన నలుగురు కానిస్టేబుళ్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, సీఐ బాలమురళీకృష్ణ, ఎస్ఐ నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా జేసీగా ఇలక్కియ బాధ్యతల స్వీకారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జేసీ ఇలక్కియ మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులతో కలిసి కృషి చేస్తానన్నారు. తాను గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినట్లు తెలిపారు. నూతన జాయింట్ కలెక్టర్‌కు విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, డీఎస్ఓ ఎ.పాపారావు, గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏఓ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి



చిలకలపూడి(మచిలీపట్నం): తమకు కేటాయించిన విధులను అధికారులు బాధ్యతతో నిర్వహించి మసూల బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జేసీ గీతాంజలిశర్మతో కలిసి అధికారులతో మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు బీచ్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. మెప్మా పీడీ పి.సాయిబాబు నోడల్ అధికారిగా, వేదిక వద్ద డ్వామా పీడీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లా పంచాయతీ అధికారి, బందరు మునిసిపల్ కమిషనర్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆహారపు స్టాళ్ల ఏర్పాటు చేసేవారు అగ్నిప్రమాద నివారణ జాగ్రత్తలు పాటించాలని స్పష్టంచేశారు. బీచ్ ఫెస్టివల్ వద్ద అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ వద్ద వీఐపీలకు గ్రీన్‌రూంలను ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూంను బందరు ఆర్డీఓ పర్యవేక్షించాలని ఆదేశించారు. మచిలీపట్నం నగరం నుంచి మంగినపూడి బీచ్ వరకు ఉచిత బస్సులను నడిపాలని, అవి బయలుదేరే వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీఓ కె.స్వాతి, మెప్మా పీడీ పి.సాయిబాబు పాల్గొన్నారు.

- ఉచిత ఇసుక పేరుతో అక్రమాలకు తెగబడుతున్న 'పచ్చ' మాఫియా
- సహజ సంపదను నిత్యం రూ.లక్షల్లో కొల్లగొడుతున్న వైనం
- ముఖ్య ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో యథేచ్ఛగా ఇసుక, మట్టి దందా
- కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విచ్చలవిడిగా దోపిడీ పర్వం
- ఈ అక్రమాలను పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందుబాటులో ఇసుక



కంచికచర్ల మండలం దొనబండ రాతి క్వారీలో పేలుళ్లు చేస్తున్న కార్మికులు (ఫైల్)

నేలతల్లికి గర్భశోకం

ప్రకృతి సంపదను దోచేస్తున్న కూటమి గద్దలు

సాక్షి గ్రౌండ్ రిపోర్టు
SAKSHI GROUND REPORT



చందర్లపాడు మండలం కాసరబాద రీచ్ వద్ద ఇసుక లోడు చేస్తున్న పొక్లెయిన్

కంచికచర్ల: అధికారం అండతో కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు ప్రకృతి సంపదను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. సహజ సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఉచిత ఇసుక మాటున మాఫియాను నడిపిస్తున్నారు. ఒక్క ఇసుకే కాదు, మట్టి, కంకర ఇలా ఏ ఒక్క దానినీ వదలకుండా యథేచ్ఛగా దోచేస్తూ నేల తల్లికి గర్భశోకం కలిగిస్తున్నారు. ఎక్కడ ప్రకృతి సంపద కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలి దోపిడీ పర్వానికి బాటలు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఈ దోపిడీ పర్వం కొనసాగుతుండటంతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. కళ్లముందే అక్రమాలు జరుగుతున్నా దృతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు. అధికారుల నుంచి కనీస చర్యలు కూడా కనిపించకపోవడంతో ప్రజాప్రతినిధుల అనుచరులు, నాయకులు, కార్యకర్తలు సైతం పేట్రేగిపోతున్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక ఎంత కావాలన్నా లభించేది. ఇసుక ధరలు సైతం లబ్ధిదారులకు అందుబాటులో ఉండేవి. దీంతో ప్రతి ఒక్కరూ సకాలంలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసుకునేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించటంలేదు. పేరుకు ఉచిత ఇసుక అయితే పేదలకు మాత్రం దొరకడంలేదు. ఇసుక రీచ్‌ల్లో కాంట్రాక్టర్‌కు నగదు చెల్లిస్తే చాలు ఎంత కావాలంటే అంత ఇసుకను లోడ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడిపోతోంది. నో చలానా.. ఓన్లీ క్యాష్ అంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా లేకుండా విజయవాడ పార్లమెంట్ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచ రులు ఒక్కో లారీకి రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. రూ.10 వేలు ఇస్తే చాలు ఎన్ని టన్నులయినా లారీలకు నింపుతామని బహిరంగంగా చెబుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన నాయకులకు ఎవరికీ సంబంధం లేకుండా ఏకపక్షంగా ఆ ప్రజాప్రతినిధి అనుచరులు మూడు రీచ్‌ల నుంచి ఇసుకను తోడేస్తున్నారు. జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో ఇసుక రీచ్‌ల నుంచి రోజుకు 300 నుంచి 400 లారీల వరకు ఇసుకను విక్రయిస్తున్నారు. వాటిలో కొన్ని లారీలను యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుకను తరలించే దందాకు పోలీసులు, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారు.



క్వారీ నుంచి కంకరను తరలిస్తున్న లారీ

నాలుగు నియోజకవర్గాల్లో మట్టి మాఫియా



వీరులపాడు మండలం అల్లూరు చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

ప్రకృతి సంపదలో ఒకటైన మట్టిపై కొంతమంది టీడీపీ నేతల కన్నుపడింది. చెరువులు, కుంటలను ఎంచుకుని రాత్రి వేళల్లో పొక్లెయిన్లతో లోతుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు ఆ మట్టిని ట్రాక్టర్లతో రియల్ ఎస్టేట్ వెంచర్ల మెరకకు తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా పొలాలను మెరక చేసుకునేందుకు రైతుల నుంచి వసూలు చేసి మట్టిని అమ్ముతున్నారు. నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలం పేరకలపాడు, గండేపల్లి, పరిటాల, గొట్టుముక్కల చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలించి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. వీరులపాడు మండలం జుజ్జూరు, జయంతి, చట్టన్నవరం తదితర గ్రామాలు, మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని షేర్ మహ్మద్‌పేట, పెనుగంచిప్రోలు మండలం, వత్సవాయి మండలం, తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో యథేచ్ఛగా చెరువుల్లో మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

ఆదాయ వనరుగా ఇసుక



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక కావాల్సినంత దొరికేది. ఇసుక ధర సామాన్యుడికి అందుబాటులో ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. ఉచిత ఇసుక పేరుతో కూటమి నాయకులు దోచుకుంటున్నారు. పెద్ద పెద్ద లారీలతో ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

– షేక్ పీర్‌సామియా, పండ్ల వ్యాపారి, పెండ్యాల, కంచికచర్ల మండలం

రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి



రియల్ ఎస్టేట్ వెంచర్లకు చెరువులు, కుంటల మట్టిని కూటమి నాయకులు అక్రమంగా తరలిస్తున్నారు. భారీ పొక్లెయిన్లతో లోతుగా మట్టిని తవ్వి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. గతంలో ఇటువంటి గోతులు తీయటం వల్ల ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు పట్టడంలేదు.

– కందుల అశోక్‌కుమార్, రైతు, పేరకలపాడు, కంచికచర్ల మండలం

అధికారులకు పట్టడంలేదు



క్వారీల్లో బిహార్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. పేలుడు పదార్థాలు అధికంగా వాడటం వల్ల బ్లాసింగ్ సమయంలో కార్మికులు మృతి చెందుతున్నారు. వారి కుటుంబాలకు క్వారీ నిర్వాహకులు ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– కోట కల్యాణ్, వ్యవసాయ, కార్మిక సంఘ ఎన్టీఆర్ జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి



కంచికచర్ల మండలం దొనబండ క్వారీ నుంచి కంకరను తరలిస్తున్న లారీ


క్వారీల్లో కంకర స్వాహా



ఎన్టీఆర్ జిల్లాలో రాతి క్వారీల్లో విచ్చల విడిగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో దాదాపు 154 రాతి క్వారీలు, 97 స్టోన్ క్రషర్లు ఉన్నాయి. కొన్ని క్వారీలకు మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. ఆ అనుమతులను అడ్డం పెట్టుకుని కొండల్లో అక్రమంగా కంకరను తవ్వుతున్నారు. క్వారీల సమీపంలో సాగర్ కాలువలను సైతం కబ్జా చేసి రోడ్లు వేసుకుని రాతి క్వారీల గుత్తేదారులు రాళ్ల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. అదేమంటే అమరావతి నిర్మాణానికి కంకర ఎంతో అవసరం కాబట్టే తామంతా వ్యాపారం చేస్తున్నామని బహిరంగంగా చెప్పుకొంటున్నారు. కంకర తీసే సమయంలో బ్లాస్టింగ్ చేసేటప్పుడు కనీసం ప్రభుత్వ నిబంధనలు కూడా పాటించటం లేదు. అధిక మొత్తంలో పేలుడు పదార్థాలు ఉపయోగించటం ద్వారా క్వారీల్లో పనిచేసే కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కార్మికుల ప్రాణాలు పోగొట్టుకుంటున్న సమయంలో వారి కుటుంబాలకు క్వారీల నిర్వాహకులు ఎంతో కొంత ముట్టజెప్పి పోలీసు కేసులు కాకుండా చూసుకుంటున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు రాతి క్వారీల నిర్వాహకుల నుంచి ముడుపులు తీసుకుని అక్రమ తవ్వకాలను పట్టించుకోవడంలేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఉచిత ఇసుక పేరుతో చోటా నాయకుల దందా

కూటమి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తర్వాత ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టింది. అధికార పార్టీ చోటా నాయకులకు ఈ పథకం మంచి ఆదాయ వనరుగా మారింది. కృష్ణానది, మున్నేరు, ఇతర ఉపనదుల్లో ఉచిత ఇసుక పేరుతో పగలు ట్రాక్టర్లు ద్వారా ఇసుకను ఒడ్డుకు చేరుస్తున్నారు. రాత్రి సమయంలో పెద్ద లారీలకు లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇసుకకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. అందుకే ఇసుకను కూటమి నాయకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు.



నందిగామ మండలం కంచలవద్ద వర్షాకాలం కోసం నిల్వచేసిన ఇసుక

ప్రలోభాలు, బెదిరింపులతో గట్టెక్కిన టీడీపీ

- ఎంపీ, ఎమ్మెల్యేల కనుసన్నల్లో తిరువూరు చైర్‌పర్సన్ ఎన్నిక
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల కొనుగోలుతో నెగ్గిన కూటమి పంతం



తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికల్లో పాల్గొన్న కౌన్సిలర్లు

తిరువూరు: ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్వీయ పర్యవేక్షణలో ఫ్యాను గుర్తుపై గెలిచిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి ఎట్టకేలకు తెలుగుదేశం పార్టీ గట్టెక్కింది. 20 మంది కౌన్సిలర్లు ఉన్న తిరువూరు నగర పంచాయతీలో 17 మంది వైఎస్సార్ సీపీ సభ్యులే. చైర్ పర్సన్ కస్తూరిబాయి పార్టీ ఆదేశాల మేరకు రాజీనామా చేశారు. 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్‌కు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడానికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మే నెల 19న చైర్‌పర్సన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. తదనుగుణంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఎన్నికకు సిద్ధమయ్యారు. అయితే టీడీపీ నేతలు ప్రలోభాలకు గురిచేసి ముగ్గురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు పచ్చ కండువాలు కప్పారు. అప్పటికీ వారికి బలం సరిపోకపోవడంతో ఎన్నిక ప్రక్రియకు విఘాతం కలిగించారు. ఎన్నికను సైతం వాయిదా వేయించగలిగారు. మర్నాడు మే 20వ తేదీన జరగాల్సిన చైర్‌పర్సన్ ఎన్నికను సైతం టీడీపీ శ్రేణులు విజయవంతంగా అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకోకుండా కట్టడి చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కౌన్సిలర్లకు రక్షణ కల్పించి వారిని చైర్‌పర్సన్ ఎన్నికకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా పోలీసులు, అధికారులు విఫలమయ్యారు. రెండో రోజు కూడా చైర్‌పర్సన్ ఎన్నిక జరగకపోవడంతో ఎన్నికల సంఘం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది.

డబ్బు ఎరచూపి...

వాయిదా పడిన చైర్‌పర్సన్ ఎన్నికను సోమవారం నిర్వహించడానికి ఎన్నికల సంఘం ఆదేశించడంతో గత వారం రోజులుగా టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను మళ్లీ బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి తమవైపునకు తిప్పుకోగలిగారు. అతి బలవంతం మీద వైఎస్సార్ సీపీ నుంచి ఏడుగురు కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు పలికారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిపి 10 మంది, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో చైర్‌పర్సన్ పదవిని దక్కించుకోగలిగారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పీజీఆర్ఎస్‌లో డీఆర్వో చంద్రశేఖరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. డీఆర్వోతో పాటు కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, సమగ్ర శిక్ష ఏపీసీ కుమిదిని సింగ్, బందరు ఆర్డీఓ కె.స్వాతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచాలని స్పష్టంచేశారు. ఆయా శాఖల పరంగా ఉన్న కోర్టు కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం కోర్టు సెలవులు ఉన్నాయని, ఆలస్యం చేయకుండా కేసులకు వెంటనే కౌంటర్‌లను దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు 151 అర్జీలను స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు, ఇతర అధికారులు

క్లుప్తంగా

ఫోర్ వీలర్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ సారథి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ లేదా డిప్లొమో కోర్సులు పూర్తి చేసిన వారు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు అర్హులన్నారు. మూడు నెలల పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలపై తరగతులు జరుగుతాయని, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 6వ తేదీ లోగా ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో స్వయంగా వచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99857 59304, 83282 52829 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణకు కృషి

ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జవహర్



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందినవారి హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పేర్కొన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఆయన సోమవారం విజయవాడ బస్ భవన్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని ఎస్సీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కేఎస్ జవహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా కమిషన్ పని చేస్తుందని చెప్పారు. వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వర్ల రాజా, బి.రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా జవహర్‌ను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ డెప్యూటీ డైరెక్టర్ బత్తుల జీవపుత్ర కుమార్, చైర్మన్ పీఎస్ ఎల్ ఎం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌కు అభినందన

ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అభినందన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ అభినందించారు. ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, తంగిరాల సౌమ్య, వేగుళ్ల జోగేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఎస్సీ మాల సంక్షేమ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడితో పాటు పలువురు పాల్గొని జవహర్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

శాతవాహన కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రిన్సిపాల్‌ను కిడ్నాప్ చేసి బెదిరించిన ఆలపాటి రాజాను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలి
- విద్యార్థి, మహిళా సంఘాల డిమాండ్



శాతవాహన కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, మహిళా సంఘాల సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): శాతవాహన కళాశాలను స్వాధీనం చేసుకుని, ప్రభుత్వమే నిర్వహించాలని విద్యార్థి, మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ శాతవాహన కళాశాలకు చెందిన కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ఎప్పటి నుంచో కబ్జా చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. గతంలో చేసిన ప్రయత్నాలను ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు చేసిన పోరాటాల వల్ల వెనక్కు తగ్గాడన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి ఆలపాటి రాజా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. అందువల్ల శాతవాహన కళాశాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు.

ఆలపాటిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు..

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వరరాజు మాట్లాడుతూ.. విద్యారంగంలో వినూత్నమైన సంస్కరణలు తీసుకువస్తానని ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చెప్పిన ఎమ్మెల్సీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి చర్యలకు పాల్పడం సిగ్గుచేటు అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్‌ను కిడ్నాప్ చేసి బెదిరించినా పోలీసులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజాపై కేసు నమోదు చేయకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి ఆలపాటి రాజాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఆలపాటి రాజాపై చర్యలు తీసుకోకపోతే శాతవాహన కళాశాల పూర్వ విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తామని విద్యార్థి, మహిళా సంఘాల సభ్యులు హెచ్చరించారు. ఐద్వా నగర కార్యదర్శి సరోజ, నగర కమిటీ సభ్యులు షకీలా, ఆశ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు కుమార స్వామి, కార్యదర్శి మాధవ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సభ్యురాలు ఇజ్జాడ లక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్ పురం మోడల్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

- ఆధునిక టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట
- హోం శాఖ మంత్రి అనిత



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఎంపీ చిన్ని

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మోడల్ పోలీస్‌స్టేషన్లు నిర్మించడంతో పాటు ఆధునిక టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ జీఎస్ రాజు రోడ్డులో నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించారు.

డ్రోన్, సీసీ కెమేరాల పర్యవేక్షణ..

ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. ఇక్కడ అన్ని వసతులు, ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో ఏపీ పోలీసులు ముందున్నారని, టెక్నాలజీ ద్వారా నేరాలకు ఏపీలో అడ్డుకట్ట వేస్తున్నామని చెప్పారు. హాట్ స్పాట్‌లు ఎక్కువగా ఉన్న విజయవాడ లాంటి చోట పటిష్టమైన భద్రత అవసరమని, ఎన్టీఆర్ జిల్లా డ్రోన్, సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌లో జిమ్, యోగా రూమ్ కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. గంజాయి నిర్మూలనలో ఈగల్ టీమ్ పనితీరు బాగుందని.. శాంతిభద్రతలు రక్షించాల్సిన బాధ్యత పోలీసులకు ఉంటుందన్నారు. పోలీసులు కఠినంగా ఉంటేనే నేరాలు అదుపులో ఉంటాయని చెప్పారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. సత్యనారాయణపురాన్ని మోడల్ పోలీస్‌స్టేషన్‌గా నిర్మించి ప్రారంభించామన్నారు. ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానంతో నేరం జరిగిన 24 గంటలలోపే నేరస్తుడిని పట్టుకునేలా కమిషనరేట్ పని చేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు వేలాది సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని, ఇందుకు సహకరిస్తున్న ప్రజలు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మె ల్యే బొండా ఉమా, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళ పరిస్థితులు తొలగించాలి

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులు తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్‌ప్లస్ ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు ఇప్పుడే సర్దుబాటు చేసి, క్రమబద్ధీకరించిన ఖాళీల జాబితాను విడుదల చేయాలని కోరామన్నారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టుల భర్తీకి సర్‌ప్లస్ టీచర్లను అధికారులు ఫోన్లు చేసి దరఖాస్తుకు ఒత్తిడి చేయటం సరికాదన్నారు. పీఎస్ హెచ్‌ఎంకు వెళ్లాల్సిన టీచర్ల జాబితాను సబ్జెక్ట్ పరంగా విడుదల చేయాలని చెప్పారు. ట్రాన్స్‌ఫర్స్ సీనియారిటీ జాబితాలు పుట్టిన తేదీ ఆధారంగా తయారు చేశారని, బదిలీల జీఓ ప్రకారం సీనియారిటీ ఆధారంగా తయారు చేయాలని కోరామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పీఎస్ హెచ్‌ఎం(ఉర్దూ) పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలన్నారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవడానికి ముందుగానే గ్రీవియన్స్ పరిష్కరించి ఫైనల్ సీనియారిటీ జాబితా విడుదల చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.లంకేష్, రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు, జయ ప్రకాష్, జైగం అబ్బాస్ పాల్గొన్నారు.



డీఈఓ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్-23 బాస్కెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా స్త్రీ, పురుషుల జట్లను నూజివీడులోని వీటీహెచ్ మైదానంలో సోమవారం ఎంపిక చేసినట్లు కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు జి.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పురుషుల జట్టుకు జి.నాగబాబు, ఎస్కే యాసిన్, ఎ.తేజ, బి.సంజయ్ శ్రీనివాస్, మహిళల జట్టుకు బి.ప్రభుదీపిక, షేక్ అస్రా, బి.ప్రణవి, బి.కుసుమ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని చెప్పారు.

'ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తారా ?'

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్ఓ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరికీ ఉచిత వైద్యం, వైద్య విద్య అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరచి, ప్రభుత్వం వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ కార్పొరేట్ దోపిడీకి తలుపులు తెరిచిందన్నారు. ఈ విధానాలు పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మధ్యతరగతి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను, వైద్య విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్నాయని, ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి, ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు కూడా జరిపిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుకు అప్పగించే కుట్ర చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను, భవనాలను ప్రైవేటుకు అప్పనంగా అప్పగించే ప్రయత్నం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వంద శాతం సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

మోపర్రు(పెదపారుపూడి): రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, అధైర్యపడవద్దని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. మండలంలోని మోపర్రులో బుడమేరు వరదలకు వన్నేరు డ్రెయిన్‌కు పడిన గండ్లను ఆయన ఎమ్మెల్యే వర్లకుమార్ రాజాతో కలిసి సోమవారం పరిశీలించారు. కొన్ని నెలల కితం వచ్చిన బుడమేరు వరదలకు మురుగునీరు సరిగా ముందుకు పారక వన్నేరు డ్రెయిన్ కట్టలు తెగిపోవటంతో పంటలు పూర్తిగా మునిగిపోయి నష్టపోయామన్నారు. మరలా అలాంటి నష్టం వాటిల్లకుండా కాలువ కట్టలను బలోపేతం చేసి తమను ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన ఆయన డ్రెయిన్ మరమ్మతుల కోసం ఏపీ నిధులు అందుబాటులో ఉన్నాయో జల వనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి, గండ్లను పూడ్చడంతో పాటు గండ్ల బలోపేతానికి తక్షణ చర్యలు తీసుకుంటామని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.

రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు లేవు..

ప్రభుత్వ రైతు సేవ కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు కలెక్టర్ బాలాజీకి ఏకరువు పెట్టారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, జలవనరుల శాఖ ఈఈ కిరణ్, తహసీల్దార్ వై.రంగారావు, రైతులు పాల్గొన్నారు.



మోపర్రు రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలజీ, ఎమ్మెల్యే వర్ల కుమార రాజా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుడివాడటౌన్: ప్రతి రోజు యోగాసనాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా సామూహిక యోగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాసనాలు చేశారు. యోగాకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్రమోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించారన్నారు. ఎంతో విశిష్టత కలిగిన యోగాపై నేటి యువతకు అవగాహన కల్పించాలని చెప్పా. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్‌రావు, గుడివాడ ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ ధీరజ్ వినీల్, స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.రంగ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో యోగాసనాలు చేస్తున్న ప్రజలు

ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ

మీ కోసంలో కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ పని చేస్తోందని, ప్రజలకు ఎటువంటి అన్యాయం జరిగినా పోలీసులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను సామరస్యంగా ఆలకించిన ఆయన పలు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.

38 అర్జీలు అందజేత..

అనంతరం ఆయన మాట్లాడుతూ మీ కోసంకు వచ్చే బాధితులకు పోలీసులు అండగా ఉంటారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని బాధితులు సమీపంలోని డీఎస్పీ, సీఐ కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్లలోనూ తమ సమస్యలను వివరించి, న్యాయం పొందవచ్చని చెప్పారు. అలాగే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మసలుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆరోపణలకు అవకాశం లేకుండా చూసుకోవాలన్నారు. తన దృష్టికి అవినీతి ఆరోపణలు వస్తే తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అవనిగడ్డకు చెందిన ఓ వివాహిత వివాహ సమయంలో తల్లిదండ్రులు తనకు కొంత వ్యవసాయ భూమిని పసుపు కుంకుమ కింద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వగా అన్నదమ్ములు ఇప్పుడు ఆ భూమి తమదంటూ అడ్డు పడుతున్నారంటూ వాపోయింది. అదేమని అడిగితే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ వాపోయింది. న్యాయం చేయాలని కోరింది. అలాగే మచిలీపట్నంకు చెందిన మరో వ్యక్తి తన పొలం సరిహద్దుదారుడు తరుచూ తనతో గొడవలు పడుతూ మానసికంగా హింసిస్తున్నాడని, చెప్పలేని పదజాలంతో దూషిస్తూ దౌర్జన్యానికి దిగుతున్నాడని అతనిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు. మొత్తం 38 అర్జీలు మీ కోసంలో అందాయి.



మీకోసంలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ గంగాధరరావు

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు ధ్వంసమైంది. కొడాలి నాగేంద్రబాబు అనే వ్యక్తి డాబాపై నిద్రిస్తుండగా ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని నాగేంద్రబాబు తెలిపాడు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం పార్టీ నాయకులతో కలిసి ధ్వంసమైన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నష్టం వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అధైర్యపడవద్దని ఆదుకొంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



పారదర్శకంగా క్రీడా కోటా అమలు

శాప్ చైర్మన్ రవినాయుడు



విజయవాడస్పోర్ట్స్: మెగా డీఎస్సీ క్రీడా కోటా ఉద్యోగాల భర్తీకి సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శాప్ అధికారులను ఆదేశించారు. నగరంలోని శాప్ కార్యాలయంలో అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలన్నారు. ఉద్యోగానికి అర్హత కలిగిన ఏ ఒక్క క్రీడాకారుడు నష్టపోకుండా నిష్పక్షపాతంగా, అవినీతికి తావులేకుండా ఎంపిక జరగాలన్నారు. మెగా డీఎస్సీని అడ్డుపెట్టుకుని ఇప్పటికే కొన్ని క్రీడా సంఘాలు, సమాఖ్యలు ఫేక్ సర్టిఫికెట్లు ఎరవేసి సొమ్ము చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఉద్యోగానికి కావాల్సిన అర్హతను కల్పిస్తూ ఫేక్ సర్టిఫికెట్లు జారీ చేసి క్రీడా సంఘాల ప్రతినిధులు లక్షలు కాజేస్తున్నారని అన్నారు. ఫేక్ సర్టిఫికెట్లు తీసుకున్నా, ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాప్ ఏవో ఆర్.వెంకటరమణ, టీఎస్‌వో ఎస్.వి.రమణ, స్పోర్ట్స్ ఆఫీసర్‌లు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర, కిషోర్, ఏడీలు వేణు, మల్లేశ్వరిభాయ్ పాల్గొన్నారు.

స్పైసెస్ బోర్డు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఎగుమతులు, విలువ జోడింపు – రైతు సాధికారతను పెంచడానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్పైసెస్ బోర్డు స్పైసెస్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తోందని స్పైసెస్ బోర్డు డీడీ ఆనంద్ దేవ్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పైసెస్ బోర్డు 2025-26 ఆర్థిక సంవత్సరానికి 'ఎగుమతి అభివృద్ధి కోసం ప్రగతిశీల, వినూత్న, సహకార జోక్యాల ద్వారా సుగంధ ద్రవ్యాల రంగంలో స్థిరత్వం' అనే ప్రధాన పథకం కింద ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందన్నారు. స్థిరత్వం, ఆవిష్కరణ, ఎగుమతి అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా భారతీయ సుగంధ ద్రవ్యాల రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ మే 26వ తేదీ నుంచి ప్రారంభమైందని, సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారుల కోసం స్పైస్డ్ పథకం యొక్క ఎగుమతి అభివృద్ధి, ప్రమోషన్ భాగాల కింద దరఖాస్తును ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వాటాదారులు www.indianspices.com ను సందర్శించి దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్లడించారు.

ఇన్నొవేషన్ హబ్ పనులను త్వరగా పూర్తి చేయండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



రామవరప్పాడు: స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో సరికొత్త ఊపు రానుందని, ఈ హబ్‌తో పారిశ్రామిక రంగం రూపురేఖలు సమూలంగా మారనున్నాయని ఇందుకు సంబంధించి స్పోక్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. టాటా ఇన్నొవేషన్ హబ్- స్పోక్ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన కార్యాలయం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఎనికేపాడులో భవనాన్ని సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌టీఐహెచ్ కార్యకలాపాలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నాలుగైదు రోజుల్లో నాలుగో అంతస్తులోని ఒక బ్లాకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ హబ్‌కు అనుసంధానంగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపూర్‌లో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, తహసీల్దారు బి.సుగుణ, ఆర్ అండ్‌బీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

- ఓవరాల్‌చాంప్ ఎన్టీఆర్ జిల్లా
- రన్నర్స్‌గా కర్నూలు జిల్లా

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల 11వ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్- 2025 పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. రన్నర్స్ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఈ పోటీలలో పురుషుల వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.శరత్ (ఎన్టీఆర్ జిల్లా) సాధించగా, మహిళల విభాగంలో సన్వి కొంగర, యు.ప్రేమాంమృత (ఎన్టీఆర్ జిల్లా) సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించిన పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. పోటీలలో భాగంగా ఎంపిక చేసిన రాష్ట్ర స్విమ్మింగ్ జట్టు క్రీడాకారులు త్వరలో ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, వెంకట్‌రామ్మోహన్, పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు డాక్టర్ ఏ.ఏ.రామలింగారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌గా కప్పు అందుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు



రన్నరప్‌గా నిలిచిన కర్నూలుజిల్లా క్రీడాకారులు

బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

మైలవరం: మైలవరం మండలం కొత్తగూడెం సెంటర్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడటంతో తలకు గాయాలయ్యాయి. పుల్లూరు శివారు కొత్తగూడెంకు చెందిన బండారు బాలకృష్ణ పుల్లూరు సెంటర్ నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మాధవరానికి చెందిన నీలపాల పుల్లారావు బొర్రగూడెంలోని తన సోదరి వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం సెంటర్‌లో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో మైలవరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకు రాగా ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నెల రోజుల క్రితం బాడవ గ్రామానికి చెందిన ఆకుతోట శ్రీనివాసరావు ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికంగా మద్యం బెల్టు షాపులు ఇక్కడ ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బెల్టు షాపులు తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.